# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్ ఉంటే.. కరెంటు ఉండదు




కాంగ్రెస్ పాలన ఉంటే కరెంటు ఉండదని రైతులే కుండబద్దలు కొడుతున్నారు. ఆ పార్టీకి రైతుల మేలు పట్టదని, మళ్లీ దళారుల రాజ్యం తెచ్చి అన్నదాతలను ఆగంజెయ్యాలని చూస్తున్నరని విమర్శిస్తున్నారు. నాడు కరెంటు ఎప్పుడు వస్తదో? ఎప్పుడు పోతదో తెల్వక పనులన్నీ విడిచిపెట్టి పొలంకాడ ఉండేటోళ్లమని, రాత్రిపూట బిక్కుబిక్కుమనుకుంట కటిక చీకట్ల పొలాల కాడికి పోయేవాళ్లమని, ఇప్పుడా బాధలు లేవని చెబుతున్నారు. కాంగ్రెస్ వాళ్లకు వ్యవసాయాన్ని ఎలా బాగు చేయాలో తెల్వదని, రైతులకు ఏంజేస్తే బాగుంటుందో వాళ్లకు తెల్వదని, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల బాధలు తీర్చుతున్నాడని పేర్కొంటున్నారు. తమకు రైతుబంధు, 24గంటల కరెంటు, రైతుబీమా, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ మద్దతు అంటూ స్పష్టం చేస్తున్నారు. 3గంటల కరెంటు వ్యవసాయానికి ఎట్ల సరిపోతుందో రేవంత్ రెడ్డే ఎవుసం చేసి చూపించాలె అని నిలదీస్తున్నారు. మూడు గంటలే సరిపోతే నాడు కాంగ్రెస్ పాలనలో నాలుగైదు గంటల కరెంటు ఉన్నప్పుడు పొలాలకు నీళ్లు పారినయా అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి దిక్కూదివానం లేని మాటలు మాట్లాడి రైతులను ఆగంచెయ్యవద్దని, ఇప్పుడిప్పుడే మంచిగవుతున్న ఎవుసాన్ని మళ్లీ ముంచే ప్రయత్నం చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 26

- నాడెవలన్న సచ్చిపోతే స్నానాలకు కూడా కరెంటుండకపోవు..
- మూడు గంటలకు మూడు గుంటలు కూడా పారయ్
- 24గంటల కరెంటుతోనే మేలు
- ఇప్పుడే ఎవుసం మంచిగైంది.. మళ్లీ ముంచొద్దు
- భూముల కొట్లాటలు మళ్లీ తేవద్దు
- హస్తం నేతల మాటలపై రైతుల మండిపాటు
- 'కేసీఆర్‌కే మా సపోర్టు' అంటున్న అన్నదాతలు

## జుట్లు జుట్లు ముడేసి కొట్లాట పెడ్తరా?



పెద్దవంగర: నాకు కొంత వ్యవసాయ భూమి ఉంది. రికార్డుల ప్రకారం రైతుబంధు వస్తాంది. ధరణి వచ్చినంక పట్టా చేసుకోవడం ఈజీ అయింది. ధరణితో రికార్డులు భద్రంగున్నయ్. భూముల ధరలు మస్తు పెరిగినయ్. అధికారుల మోసాలు తగ్గినయ్. అమ్మినా, కొన్నా.. సులభంగా రిజిస్ట్రేషన్లు అవుతున్నయి. ధరణి ఎత్తేస్తే ఏ రైతు భూమి ఎవరికి ఉందో తెలియదు. ఇంత మంచి ధరణిని కాంగ్రెస్ రదు చేస్తామంటాంది. అట్ల చేస్తే రైతులు అరిగోస పడుతరు. మళ్లీ పాత పద్ధతి తెస్తే పైరవీకారులు పుట్టుకొస్తరు. లంచాలు పెరుగుతయ్. ఒకరి భూమి మరొకరికి రాసి కొట్లాటలు పెడుతరు. జుట్లు జుట్లు ముడేసి తాకులాటలు పెట్టే కాంగ్రెస్‌ను తరిమికొడ్తం. మా జోలికి రావొద్దు. ఇప్పుడున్న బీఆర్‌ఎస్ సర్కారుకే మా మద్దతు. ఈ ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ సార్ ప్రభుత్వమే వస్తది.

- దోనాల రత్నాకర్‌రెడ్డి, రైతు, కొరిపెల్లి

## మా నాన్న రాత్రంతా పొలంకాన్నే ఉండేటోడు



పెద్దవంగర: నాడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తదో తెల్వక మా నాన్న మోటర్ కాన్నే రాత్రంతా కావలి ఉండేటోడు. వచ్చినా ఎంతసేపు.. ఒక్క మడికూడా పారకముందే పోతుండె. కానీ సీఎం కేసీఆర్ వచ్చినంక 24గంటల కరెంట్‌తో బాధలన్నీ పోయినయి. పొలంకాడికి ఎప్పుడంటే అప్పుడు పోయి మోటర్ పెట్టుకుంటున్నం. సంబురంగా ఎవుసం చేసుకుంటున్నం. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డికి మతిభ్రమించి వ్యవసాయానికి 24గంటలు ఎందుకు? 3గంటలు చాలు అంటున్ననట. ఆ కరెంట్‌తో ఎవుసం ఎట్ల చేస్తం. 10హెచ్‌పీ మోటర్ వాడాలని అంటున్నడట? ఆ మోటర్లు ఎవడన్న వాడుతడా? మతి ఉండే మాట్లాడుతున్నడా? రేవంత్‌కు మా గురించి అవసరం లేదు. కేసీఆర్ ప్రభుత్వాన్ని అందరం కోరుకుంటున్నం. మళ్లీ బీఆర్‌ఎస్ సర్కారే వస్తది.

- ఎరుకలి చిరంజీవి, రైతు, గంట్లకుంట

## ధరణితోనే మాకు భరోసా



గూడూరు: ధరణితోనే మాకు, మా భూములకు భరోసా కలిగింది. గతంలో మాకు భూములు ఉన్నా సరైన కాగితాలు లేక భయపడేవాళ్లం. ఆక్రమణకు గురవుతాయని, వేరే వారి పేర్ల మీదకు మారుతాయని భయంగా ఉండేది. ఇవాళ ధరణి వచ్చిన తర్వాత ఆ రంది పోయింది. మా భూములకు రక్షణ కలిగింది. కేవలం 15 నిమిషాల్లోనే మా పేరు మీద అవుతున్నయి. మేం తప్ప మరే అధికారి గానీ, చివరకు సీఎం చెప్పినా కూడా మా భూములు మారవు. మా పేరుమీదనే ఉంటయి. ఇలాంటి పోర్టల్ తీసుకొచ్చి మాకు వెన్నెముకలా ఉన్న సీఎం కేసీఆర్‌ను మేం జీవితంలో మరువం. మా భూములకు ఇవాళ రైతుబంధు వస్తున్నది, సమృద్ధిగా కరంట్ 24గంటలు వస్తున్నది. దీంతో మా పంటలకు ఢోకా లేకుండా పండుతున్నాయి. ధరణి పోర్టల్ తీసిస్తే మళ్లీ మాకు కష్టాలు తప్పవు. కేసీఆర్ ప్రభుత్వమే మళ్లీ రావాలి. అప్పుడే అందరూ సంతోషంగా ఉంటరు.

- వీరన్న, రైతు, పానుగోడు

## ధరణి ఎత్తేస్తే రైతుల బతుకులు ఆగమే..



డోర్నకల్: సీఎం కేసీఆర్ పుణ్యమాని ధరణి పోర్టల్ వల్లే రైతుకు మేలు జరిగింది. ధరణితో భూములు నమోదై వాటిపై శాశ్వత హక్కులు వచ్చినయి. రైతు భూములు ఎలాంటి కబ్జాలకు గురి కాకుండా కేసీఆర్ మంచి నిర్ణయం తీసుకున్నడు. ఒకవేళ కాంగ్రెస్ వచ్చి ధరణి ఎత్తేస్తే మా బతుకులు ఆగమే. కాంగ్రెస్ నాయకులు రైతుల జీవితాలతో ఆడుకుంటు న్నరు. వాళ్లేమైనా రైతుల కష్టాలు తీర్చారా? రైతుల గురించి ఆలోచన చేశారా? రైతులను మోసం చేసి ఓట్లు వేయించుకు నేందుకు కుట్ర చేస్తున్నరు. రైతులు వారి మాయమాటలు నమ్మరు. ఓటుతో తగిన బుద్ధి చెబుతరు. కేసీఆర్ ప్రభుత్వం మళ్ల అధికారంలోకి వస్తది. కేసీఆర్ సారే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

- గుగులోత్ మారు, రైతు, బోడ్రాయి తండా

## మంచి చేసిన కేసీఆర్ వెంటే మేమంతా



ఇనుగుర్తి: ధరణిని తొలగించి రైతుల భూములను లాక్కునేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తున్నది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల అభివృద్ధిని విస్మరించింది. కరెంట్ లేక రైతులు రాత్రుళ్లు జాగారం చేసేది. విషపురుగులతో మృతిచెందారు. రైతుల భూములు భద్రంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ధరణిని తొలగిస్తే రైతులంతా తిరగబడుతారు. రైతులను ముంచే కుట్రకు కాంగ్రెస్ పార్టీ పూనుకున్నది. అలాంటి కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వం. మంచి చేసిన కేసీఆర్ వెంటే మేమంతా ఉంటాం.

- మాలోత్ రమేశ్, రైతు, లాలుతండా

## మళ్ల దళారులు వస్తరు.. రైతుబంధు రాకుంటైతది..



మరిపెడ: ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల్లో భూ హద్దుల వివాదంతో తరచూ గొడవలు జరిగేవి. చాలాచోట్ల ప్రాణాలు కూడా పోయినయి. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో భూ వివాదాలు తగ్గాయి. భూ రికార్డుల ప్రక్షాళన, ధరణితో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం అయ్యాయి. రైతన్నలకు రైతుబంధు పథకం ద్వారా పంట పెట్టుబడులు అందుతున్నయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరణిని తీసేస్తాం అంటున్నరు. వారిని నమ్మితే ఇక అన్నీ కష్టాలే. ధరణి రద్దు చేస్తే దళారీలు రాజ్యమేలుతారు. రైతుబంధు అందకుండా పోతుంది. రైతన్నలు విజ్ఞతతో ఆలోచన చేసి సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి. కారు గుర్తుకు ఓటేసి రైతన్న సంక్షేమానికి అండగా నిలువాలి.

- గంట్ల మహిపాల్‌రెడ్డి, రైతు, మరిపెడ

## కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వ్యవసాయం కుంటుపడుద్ది



మహబూబాబాద్ రూరల్ : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ చీకటి రోజులు వస్తయి. రైతుల బతుకులు ఆగమైతయి. వ్యవసాయం కుంటుపడుతది. మళ్లీ వలసలు పోవాల్సిన పరిస్థితి వస్తది. 3గంటల కరెంటుతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తది. సగం పొలాలు కరెంట్ లేక ఎండిపోతయి. కాంగ్రెస్ నాయకులు ఓటు కోసం రాజకీయాలు చేస్తున్నరు. ప్రజలను కష్టాలు పెట్టే విధానాలు అమలు చేస్తాంది. సీఎం కేసీఆర్ రైతు శ్రేయస్సు కోసం 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు బీమా వంటి అనేక పథకాలను తెచ్చి ఎంతో మంచిగ చేసిండు. రైతు బీమాతో ఎంతో భరోసా కల్పించిండు. అన్నదాతకు వెన్నెముకగా నిలిచిండు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మోసపోతం. అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌కే అండగా ఉంటం. కేసీఆర్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుంటం.

- తూముల శ్రీధర్, రైతు, బేతోలు

## మా కష్టాలు తీర్చినోళ్లను వదులుకుంటమా?



గూడూరు : 24 గంటల కరెంట్ ఇస్తున్న దేవుడిలాంటి కేసీఆర్‌ను కాదని, 3గంటల కరెంట్ ఇచ్చేటోడి వెనుక ఉంటమా? ముమ్మాటికీ ఉండము? ఇదివరకు కరెంట్ కష్టాలు ఎట్ల ఉండేవో కళ్లార చూసి ఏడ్చినమో ఇంక మాది యాదికున్నది. తెలంగాణ రాకముందు కూలి పనికి పోయేది.. ఇయాల నా వ్యవసాయం నేనే చేసుకుంటున్నా. 24గంటల కరెంట్‌తోనే పత్తి పంట బ్రహ్మాండంగా పండుతున్నది. కరెంట్ బిల్లు కూడా కట్టే పనిలేదు. ఎప్పుడు మోటర్ వేస్తే అప్పుడే నీళ్లు అందుకున్నట్లే వస్తున్నయి. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నడు కాంగ్రెస్ నాయకుడు. బావులల్ల నీళ్ల ఉంటయా? బావులు ఎండిపోవా? వాళ్ల ప్రభుత్వం ఉన్నప్పుడు మా ఆయన రాత్రిపూట కరెంట్ కోసం వెళ్లి ఆరోగ్యం దెబ్బతీసుకున్నడు. తెలంగాణ వచ్చినంక పొద్దుందాకనే కరంట్ ఉండి మంచిగ చేన్లకు నీరు పారించుకొని నీళ్లు పారినంక ఇంటికి వస్తున్న. రాత్రంత ఏ బాధలేకుండా ఉంటున్నం. కేసీఆర్ సర్కారు ఉంటేనే మాకు మంచిది. మళ్లీ ఆ ప్రభుత్వానికే మా మద్దతు.

- పడిగె నర్సమ్మ, రైతు, గాజులగట్టు

## రైతుల అవసరాలు వాళ్లకేం తెలుసు?



దంతాలపల్లి: కేసీఆర్ ప్రభుత్వంలో ఇప్పుడు 24గంటల ఉచిత కరెంట్‌తో బంగారం లాంటి పంటలు పండిస్తున్నం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి వచ్చి వ్యవసాయం మీద కనీస అవగాహన లేకుండ మాట్లాడుతున్నడు. చిన్న, సన్నకారు రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడరు అనే విషయాన్ని గుర్తించాలి. ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ నాయకులు ఇష్టమచ్చినట్లు మాట్లాడుతున్నరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24గంటల కరెంటు రైతులకు ఉచితంగా ఇస్తుంటే కాంగ్రెస్ వాళ్లు ఓట్ల కోసం ఇలా రైతులతో రాజకీయం చేస్తున్నరు. కాంగ్రెసోళ్లు వ్యవసాయాన్ని డెవలప్ చేత్తమని రైతులను ఆగంపట్టిచ్చేలా ఉన్నరు. ఇప్పుడు అందరం 3హెచ్‌పీ కానీ 5హెచ్‌పీ మోటర్లను వాడుతున్నం. సామాన్య రైతులు 10హెచ్‌పీ మోటర్లు ఎందుకు వాడుతరు?. వ్యవసాయ బావులకు 10హెచ్‌పీ మోటర్లు ఏ రైతు కూడా ఉపయోగించరు. బావిలో నీరు త్వరగా ఖాళీ అయిపోయి, మోటర్ మీద భారం పడుతది. వ్యవసాయం మీద అవగాహన లేని కాంగ్రెస్ నాయకులకు రైతుల పని, వారి అవసరాలు ఏ తెలుసు? అందుకే 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసే కేసీఆర్ ప్రభుత్వానికి రైతులమంతా అండగా ఉంటం.

- తాటిమల్ల అనంతరావు, రైతు, కుమ్మరికుంట్ల

## కేసీఆర్ సర్కార్‌లోనే కష్టాలు తీరాయి..



కొత్తగూడ: తెలంగాణ వచ్చినంక, కేసీఆర్ సర్కార్‌తోనే మా కష్టాలు తీరాయి. పదేళ్లలో పుష్కలంగా నీళ్లు ఇవ్వడంతో పాటు కరెంట్ కష్టాలు లేకుండా చేసింది. గత కాంగ్రెస్ పాలకుల హయాంలో వ్యవసాయానికి నీళ్లుండకపోయేది.. కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలువక పడిగాపులు కాసేది. కేసీఆర్ పుణ్యమాని రైతులకు 24గంటల కరెంట్ ఇస్తుండు. రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు అందించి మాకు అండగా ఉన్నడు. ఎప్పుడైనా పంటకు నీరు పారించేటట్టు 24గంటలు కరెంట్ ఉండడంతో ఇబ్బందుల్లేవు. ఇంత మంచి ప్రభుత్వం ఉన్నంక మళ్లీ కష్టాలు తెచ్చే కాంగ్రెస్ మాకెందుకు?. నేను కేసీఆర్ ప్రభుత్వానికే మద్దతు తెలుపుతున్నా.


- మాలోత్ భద్రు, రైతు, ముస్మీ

## మునుపటి కష్టాలు మాకొద్దు




నెల్లికుదురు: వచ్చిపోయే కరెంట్‌తో టార్చిలైట్లు పెట్టుకొని పొలాలకు నీళ్లు పెట్టడానికి పోయిన రోజులు మేమింకా మర్చిపోలేదు. మునపటి కష్టాలు మళ్లీ మాకొద్దు. కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తే అప్పటిలెక్క తిప్పలే పడాల్సి వస్తది. ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన మూడు గంటల కరెంట్ కూడా సక్కగియ్యలే. నీళ్లు పెడుదామని పొలంకాడికి పోంగనే కరెంట్ పోవుడు. ఇంటికచ్చిన కొద్దిసేపటికి మళ్లీ కరెంటొచ్చుడు. ఊ.. అంటే పోవుడూ.. వచ్చుడూ.. అలా నికరంగా గంట సేపన్న ఉండకపోవు. వచ్చిపోయే కరెంట్‌తో మోటర్లు కాలి పోయేది. మోటర్ల రిపేరుకు మస్తు ఖర్చు చేసినం. ప్రస్తు తం కేసీఆర్ సార్ ఇస్తున్న 24గంటల ఉచిత కరెంట్‌తో రంది లేకుంట పంటలకు నీళ్లు పారించుకుంటున్నం. రాత్రిళ్లు పొలాల కాడెకెళ్లుడే మర్చిపోయినం. మళ్లీ కాంగ్రెస్‌ను నమ్మితే మనుపటి కష్టాలొస్తయ్. ఇప్పటికే రేవంత్‌రెడ్డి 3గంటల కరెంట్ సాలంటాండు. 10హెచ్‌పీ మోటర్లంటు సోయిలేకుంట మాట్లాడుతాండు. ఇగ అధికారం వస్తే రైతన్న పరిస్థితి ఎట్లుంటదో.!

- రాయిలీ ఉప్పలయ్య, రైతు, చిన్నముప్పారం




## కాంగ్రెసను నమ్మితే కరెంట్ కష్టాలు తప్పవు



మరిపెడ: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ కష్టాలు తప్పవు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఫవర్ హాలీడే కొనసాగింది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పగలు, రేయి కరెంట్ కోతలు లేకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తుంది. దీంతో మా ల్యాబ్ 24గంటల పాటు ప్రజలకు సేవలు అందజేస్తున్నది. కాంగ్రెస్‌కు ఓటేస్తే అంధకారం ఏర్పడుతోంది. కరెంట్‌పై ఆధారపడి ఉపాధి పొందే వారు కూలీ పనులు వెతుకోవాల్సిందే. కారు గుర్తుకు ఓటేసి కరెంట్ కష్టాలు తీర్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉంటాం.

-చెన్నబోయిన మహేశ్, ల్యాబ్ టెక్నీషియన్, మరిపెడ